క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఆర్.జంబులదిన్నె అభయాంజనేయ స్వామి ఆలయంలో భక్తులకు హారతిస్తున్న అర్చకులు

ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీ నరసింహ కంబగిరిస్వామి, శ్రీ అభయాంజనేయస్వామి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు వేకువజామున్నే ప్రత్యేక అభిషేకాలు, సామూహిక కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు లక్ష్మణస్వామి, కమలేష్‌శర్మ, అనంతయ్య, భాస్కరశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆలయాభివృద్ధికి విరాళం



ఆలయ నిర్వాహకులకు విరాళం అందజేస్తున్న దాతలు

రుద్రవరం:కొండమాయపల్లె పంచాయతీ మజరా వెలగల పల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి నంద్యాల పట్టణానికి చెందిన రాజారావు, వసంత సుందరి దంపతులు శనివారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. దాతలు ఉదయాన్నే స్వామి అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం తమ మొక్కులో భాగంగా ఆలయ నిర్వాహకులు మధు సూధనరెడ్డి, రంగనాయకులు,నరసింహులుకు విరాళం మొత్తం అందించారు.

ఈ-కేవైసీ వేగవంతం చేయాలి



క్రిష్టిపాడులో ఈకేవైసీ చేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్

దొర్నిపాడు: ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల ఈకేవైసీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఏపీఓ హనిఫా శనివారం పేర్కొన్నారు. మండలంలో 9వేలకు పైగా జాబ్‌కార్డులు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 60 శాతం పూర్తి చేశారని, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు సమన్వయం చేసుకుంటూ వెంటనే పూర్తి చేయాలన్నారు. ఉపాధి పనుల్లో అక్రమాలను అరికట్టేందుకే ఈకేవైసీ చేస్తున్నట్లు చెప్పారు. దీంతో ఒకరి పేరున మరొకరు హాజరు వేసుకునేందుకు వీలుండదన్నారు.

నేడు కృతజ్ఞతార్పణల పండుగ



విద్యుద్దీపాలంకరణలో చర్చి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని పరిశుద్ధ మత్తయి (పాస్టరేట్-3) ఆలయంలో కృతజ్ఞతార్పణల పండుగ(కోత పండుగ)ను ఆదివారం నిర్వహిస్తున్నట్లు నంద్యాల డయాసిస్ ట్రెజరర్, పాస్టరేట్-3 డీనరీ చైర్మన్ నందం ఐజక్ శనివారం తెలిపారు. ఈ వేడుకకు చర్చి పరిధిలో ఉన్న సభ్యులు కుటుంబాలతో కలిసి పాల్గొన్నాల న్నారు. దేవునికి దశమ భాగం చెల్లించడమే కోత పండుగ ముఖ్య ఉద్దేశమన్నారు.

23 నుంచి హాకీ ఇండియా సెంటీనరీ ఉత్సవాలు

కర్నూలు (టౌన్): భారతదేశంలో హాకీ ఇండియా అసోసియేషన్ ఏర్పడి వందేళ్ల పూర్తి చేసుకున్నందున ఈనెల 23 నుంచి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు హాకీ ఇండియా జిల్లా కార్యదర్శి దాసరి సుధీర్ తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హాకీ సెంటీనరీ ఉత్సవాల్లో భాగంగా 23న కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం నుంచి కొండారెడ్డి బురుజు వరకు క్రీడాకారుల ర్యాలీ, 30న రక్తదాన శిబిరాలు, వ్యాసరచన పోటీలు, వచ్చే నెల 7న స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో హాకీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హాకీలో విశేషంగా సేవలు అందించిన క్రీడాకారులను సత్కరించనున్నట్లు చెప్పారు. సమావేశంలో హాకీ సంఘం ఉపాధ్యక్షులు ప్రవీణ్, ఈసీ మెంబర్లు అరుణ్, రవికుమార్, మనోహార్ పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

నంద్యాల: పట్టణంలోని బైర్మల్ స్ట్రీట్ వద్ద ఓ వ్యక్తిపై అగంతకులు దాడి చేసి నగదు దోచుకెళ్లారు. నందమూరినగర్‌కు చెందిన చాంద్‌బాషా నడుచుకుంటూ వెళుతుండగా ఈ ఘటన జరిగింది. దాడి చేయడంతో పాటు వద్ద ఉన్న రూ.3 వేల నగదు తీసుకెళ్లినట్లు బాధితుడి శనివారం నంద్యాల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అరటి రైతు దిగాలు





అరటి చెట్లకు సిగతోక మచ్చ తెగులు సోకి నల్లబారిన ఆకులు, కోతకు ముందే చెట్టుపై మాగిన అరటి గెల



చిన్నవంగలిలో అరటి గెలలను స్థానిక వ్యాపారులకు విక్రయిస్తున్న దృశ్యం

చాగలమర్రి: కొద్ది రోజులుగా ఉల్లి, టమాట ధరలు పతనం కాగా తాజాగా అరటి ధరలు పడిపోయాయి. దీంతో ఈ పంట సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో దాదాపు 500 ఎకరాల్లో అరటి పంట సాగు చేశారు. ఇందులో అత్యధికంగా చాగలమర్రిలోనే పండిస్తున్నారు. ఈ మండలంలో 240 ఎకరాల్లో పంట సాగైంది. అయితే, మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో దళారులు, వ్యాపారులు అడిగిన ధరకు పంటను విక్రయించాల్సి వస్తోంది. బయట మార్కెట్‌లో అరటి 1 టన్ను రూ.10 వేల నుంచి రూ.15 వేలు పలుకుతోంది. అయితే, రైతుల వద్ద మాత్రం నాణ్యతను బట్టి వ్యాపారులు రూ.2 వేల నుంచి రూ.4 వేలకు మించి అడగడం లేదు. ఇంత తక్కువకు విక్రయిస్తే రైతులకు గిట్టుబాటు కాదు. అలా అని అరటిపండ్లను త్వరగా అమ్మకపోతే అవి చెట్లపైనే మగ్గిపోయి నష్టపోవాల్సి వస్తుంది. దీని నుంచి తాము గట్టెక్కేందుకు ప్రభుత్వమే నేరుగా మద్దతు ధరతో కొనుగోలు చేసి ఎగుమతులతో దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉంటే ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అరటి పంటకు తెగుళ్ల సోకడం, నాణ్యత దెబ్బతినడం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రేపు హుండీ కానుకల లెక్కింపు

మహానంది: క్షేత్రంలో ఈ నెల 13వ తేదీన హుండీ కానుకల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్ల ఆలయాలతో పాటు కోదండరామాలయం, వినాయకనంది, గో సంరక్షణ విభాగం, అన్నప్రసాద విభాగాల్లోని హుండీల కానుకలను లెక్కిస్తామని చెప్పారు. స్థానిక అభిషేక మండపంలో జరిగే లెక్కింపు కార్యక్రమానికి సిబ్బంది హాజరు కావాలని కోరారు.

మహానందిలో పెళ్లిళ్ల సందడి

మహానంది: క్షేత్రంలో శనివారం వీకెండ్ కావడం, ముహూర్తాలు ఉండటంతో పెళ్లిళ్లు జరిగాయి.దీంతో వేలాది మంది భక్తులు మహానందికి వచ్చారు. ముందుగా భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లతో పాటు ఉప ఆలయాలను సందర్శించారు. నూతన వధూవరులు స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.

బాలికలకు నిత్యావసర కిట్ల పంపిణీ



బాలికలతో లయన్స్ క్లబ్ సభ్యులు

నంద్యాల (వ్యవసాయం): నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పట్టణ శివారులోని ఎయిమ్ ఫర్ సేవ బాలికల ఛాత్రాలయంలో క్లబ్ వ్యవస్థాపక సభ్యులు, ఆత్మకూరు నాగభూషణం శెట్టి చారిటీస్ చైర్మన్ ఆత్మకూరు సుదర్శనం శెట్టి సౌజన్యంతో 50 మంది బాలికలకు నిత్యావసర వస్తువుల కిట్లు పంపిణీ చేశారు. ప్రపంచ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరు సుదర్శనం శెట్టి మాట్లాడుతూ ఛాత్రాలయ బాలికలకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. డాక్టర్ సహదేవుడు, డా రవికృష్ణ మాట్లాడుతూ బాలికలను విద్యారంగంలో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసి అన్ని రంగాల్లో అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వాలు, సామాజిక సేవా సంస్థలు బాలికలను ప్రోత్సహించడానికి ముందుకు వస్తున్నాయని, ఆ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నాగరాజు, రవికుమార్, నిజాముద్దీన్, జనార్ధన్, ఛాత్రాలయ నిర్వాహకులు మోక్షేశ్వరుడు పాల్గొన్నారు.

న్యాయవాదిని కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న అంజాద్‌బాషా సిద్ధిఖీ

నంద్యాల(అర్బన్): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై బూటు విసరిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని ఇమాంల సంఘం జిల్లా అధ్యక్షుడు అంజాద్‌బాషా సిద్ధిఖీ అన్నారు. ప్రధాన న్యాయమూర్తిపై దాడి ఘటనను ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలన్నారు. శనివారం సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. న్యాయ వ్యవస్థను కించపరచడం దుర్మార్గమైన చర్య అన్నారు. బూటు విసిరిన న్యాయవాదికి సుప్రీంకోర్టు ఆల్ ఇండియా బార్ కౌన్సిల్‌లో ఎక్కడ పాల్గొనకుండా తీర్మానాలు చేయాలని కోరారు.

రేపు ట్రస్ట్‌బోర్డు సభ్యుల ప్రమాణస్వీకారం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి సలహాదారులతో సోమవారం ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్లు దేవస్థాన అధికార వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను దేవస్థానం సిద్ధం చేస్తోంది. 17మంది సభ్యులతో దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేయిస్తారు. అలాగే దేవస్థాన ప్రధానార్చకులు ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ప్రమాణం చేస్తారు. అనంతరం సభ్యులు చైర్మన్‌ను ఎన్నుకుంటారు. చైర్మన్‌గా పోతుగంటి రమేష్‌నాయుడు పేరు ఖరారైనట్లు సమాచారం. ట్రస్ట్‌బోర్డు సభ్యుల ప్రమాణస్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ హాజరుకానున్నట్లు తెలిసింది.

యువ వైద్యులకు అవగాహన సదస్సు

కర్నూలు(హాస్పిటల్): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక బిర్లాకాంపౌండ్‌లోని హెర్నియా సెంటర్ మీటింగ్ హాలులో యువ వైద్యులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు నిర్వహించే ఈ మెడికల్ నాలెడ్జ్ వర్క్‌షాప్‌ను వైద్య విద్యలో ప్రాయోగిక అవగాహన పెంపు, సేవా దృక్పథం, అభివృద్ధి లక్ష్యంగా ఏర్పాటు చేసినట్లు జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మారెడ్డి తెలిపారు. యువ వైద్యులు శాస్త్రీయ దృష్టితో సేవాభావాన్ని పెంపొందించుకోవాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు మహమ్మద్ మియా, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ స్వాతి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, అధ్యక్షులు దామోదర్, రాష్ట్ర సమాచార కార్యదర్శి మీనా ధనుంజయ పాల్గొన్నారు.

అన్సర్ డైమాండ్, గోల్డ్ జ్యువెలరీ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఆభరణాలు పరిశీలిస్తున్న మంత్రి తనయుడు ఫిరోజ్, అన్సర్

నంద్యాల(అర్బన్): పట్టణంలోని చామకాల్వ వద్ద ఉన్న సౌజన్య కన్వెన్షన్ హాల్‌లో అన్సర్ డైమాండ్, గోల్డ్ జ్యువెలరీ గ్రాండ్ ఎగ్జిబిషన్‌ను శనివారం మాజీ మంత్రి ఫరూక్ తనయుడు ఎన్ఎండీ ఫిరోజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్సర్ జ్యువెలరీ అధినేత అన్సర్ మాట్లాడుతూ ఈనెల 11, 12, 13 తేదీల్లో డైమాండ్, బంగారుతో తయారు చేసిన వివిధ మోడల్‌లో ఉన్న ఆభరణాలు ఈ ఎగ్జిబిషన్‌లో ఉంచామన్నారు. హైదరాబాద్, విజయవాడ వంటి పట్టణాల్లో లభించే డైమాండ్ ఆభరణాలు తమ వద్ద లభిస్తాయని వెల్లడించారు. .

టపాసుల విక్రయాలకు అనుమతి తప్పనిసరి

ఆత్మకూరు: సబ్ డివిజన్ పరిధిలో రానున్న దీపావళి సందర్భంగా బాణాసంచా విక్రయదారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, అనుమతి లేకుండా అమ్మడం, నిల్వచేస్తే చర్యలు తప్పవని ఆత్మకూరు డీఎస్పీ రామంజినాయక్ స్పష్టం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా వారిపై పేలుడు పదార్థాల చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రమాదాలకు తావు లేకుండా భద్రతా ప్రమాణాలు, సూచనలు పాటిస్తూ షాపులను ఏర్పాటు చేసుకుని టపాసులు విక్రయించాలని విక్రయదారులను ఆదేశించారు. వ్యాపారులు ఎక్కువగా క్రాకర్స్ నిల్వ ఉంచినా, ఫైర్ సేఫ్టీ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారా లేదా అనే విషయమై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తారని చెప్పారు. అధికారులు నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే నిబంధనల మేరకు దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అక్రమంగా టపాసులు విక్రయిస్తుంటే డయల్ 112 లేదా సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

విద్యుత్‌తో జర జాగ్రత్త

- వర్షాకాలంలో పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదాలు
- అప్రమత్తంగా ఉండాలని సూచన

- గడివేముల మండలం పెసరవాయి గ్రామానికి చెందిన కేబుల్ ఆపరేటర్ వాసుదేవరెడ్డి(42) ఈ ఏడాది మే నెలలో విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గాలి, వానకు గ్రంథివేముల సమీపంలో కేబుల్ వైర్లు తెగిపోవడంతో వాటిని సరి చేసేందుకు స్తంభం పైకి ఎక్కగా ఈ ఘటన జరిగింది.
- గత నెల 2వ తేదీన జూపాడుబంగ్లా మండలం తూడిచెర్ల గ్రామానికి చెందిన రంజీత్ కుమార్ గోస్పాడు మండలం ఎం.కృష్ణాపురం గ్రామ సమీపంలో మినుము కోత వేసేందుకు మిషన్ వెంట వచ్చాడు. కోత మిషన్‌కు షార్ట్‌సర్క్యూట్‌కావడంతో అపస్మారక స్థితికి చేరుకొని ప్రాణాలు వదిలాడు.
- ఈ రెండే కాదు జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 53 విద్యుత్ ప్రమాదాలు జరిగాయి. వీటిలో సాధారణ వ్యక్తులు 14 మంది మృతి చెందగా 9 మంది గాయపడ్డారు. అలాగే విద్యుత్ శాఖలో పనిచేసే ఇద్దరు గాయాలకు గురయ్యారు. విద్యుత్ ప్రమాదాల్లో 25 పశువులు మృతి చెందగా, మూడు జీవాలు గాయపడినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.



పొలంలో వ్యవసాయ మోటరును సరిచేసుకుంటున్న రైతు

గోస్పాడు: గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈ సమయంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా ఇళ్లు, కార్యాలయాలు, వ్యవసాయ బావుల వద్ద ప్రమాదాలు పొంచి ఉంటాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణ, ఆస్తి నష్టాలు చోటుచేసుకునే ప్రమాదముంది. జిల్లాలో మొత్తంగా 7.08లక్షలు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 1,09,061 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి.

ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల్లో కొన్ని

- విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే నివాసాలు, పరిశ్రమల్లో వైరింగ్ ముఖ్యం. విద్యుత్ వస్తువుల సామర్థ్యాన్ని అంచనా వేసుకోవడంతో పాటు భవిష్యత్ అవసరాలు తీర్చేలా పటిష్టమైన నాణ్యమైన రాగి తీగలు కలిగిన వైర్లను వినియోగించాలి. వైరింగ్ రంధ్రాల్లో ఎలుకలు, వర్షం నీరు చేరకుండా చూసుకోవాలి. శిక్షణ పొందిన ఎలక్ట్రీషియన్లతో వైరింగ్ చేయించుకోవాలి.
- కరెంటు పనులను అనుభవం ఉన్న వారితో చేయించుకోవాలి. ఐఎస్ఐ మార్కు కలిగిన వైర్లు, స్విచ్లు, ఇతర పరికరాలను వాడాలి.
- విద్యుత్ నియంత్రికల వద్ద అనధికారికంగా ఫ్యూజులు వేయడం, మరమ్మతులకు పూనుకోవడం , ఏబీ స్విచ్‌లు ఆపరేట్ చేయడం ప్రమాదకరం.
- విద్యుత్ పరికరాలన్నింటికీ ఎర్తింగ్ తప్పనిసరి. కరెంటు ఉపకరణాలు ఉపయోగించే సమయంలో రబ్బర్ చెప్పులు, షూ తప్పనిసరిగా వినియోగించాలి.
- అరుబయట వాడే వైర్లు, స్విచ్ బోర్డులు వాటర్ ప్రూఫ్ ఉంటే మేలు

విద్యుత్ సమస్యలను నిర్లక్ష్యం చేయరాదు



విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు తక్షణమే విద్యుత్ అధికారులకు తెలియజేయాలి. విద్యుత్ సిబ్బంది ద్వారానే పనులు చేయించుకోవాలి. ప్రధాన లైన్లకు సంబంధించి ఎప్పటికప్పుడు నిర్వహణ పనులు చేపట్టి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. వర్షాకాలం కావడంతో పొలాల వద్ద విద్యుత్ మోటార్ల వినియోగించే సమయంలో రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలి.
–సుధాకర్ కుమార్,విద్యుత్‌శాఖ ఎస్ఈ,నంద్యాల

- విద్యుత్ పరికరాలు,తీగలపై దుస్తులు ఆరబెట్టరాదు.
- నాణ్యమైన సెల్‌ఫోన్ చార్జర్లనే ఉపయోగించాలి.

మాలలపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు త్యాగరాజు

నంద్యాల(అర్బన్): రాష్ట్రంలో మాలలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని దళిత సంఘం సీనియర్ నాయకులు వాడాల త్యాగరాజు విమర్శించారు. శనివారం నంద్యాల పట్టణంలోని రైడర్ మెమోరియల్ హాల్‌లో మాలమహానాడు నంద్యాల జిల్లా నూతన కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా త్యాగరాజు, మాల సంఘాల జేఏసీ రాయలసీమ గౌరవాధ్యక్షుడు అశోక్‌రత్నం, జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని కై కలూరు, దెందలూరు, చీరాలలో మాలలపై దాడులు జరుగుతున్నా కూటమి ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తుందన్నారు. మాలలు ఐకమత్యంతో సంఘటితంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. మాల సంఘాల జేఏసీ గౌరవాధ్యక్షుడు అశోకరత్నం మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులను మంజూరు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి మాట్లాడుతూ క్రిమిలేయర్ విధానాన్ని రద్దు చేసి మాలలకు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అనంతరం నూతన జిల్లా కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా బిల్లలాపురం గ్రామానికి చెందిన దేవాంతకుడు, ఉపాధ్యక్షుడిగా దర్గా నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా సురేష్‌పాల్, రమణ, జిల్లా జాయింట్ సెక్రటరీగా శివుడు, ప్రసాద్‌లతో పాటు మరో ఐదుగురిని కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకురాలు రోజక్క, పోలూరు సర్పంచ్ ప్రతాప్, మద్దూరు రాజేంద్ర, మారం నాగరాజు, మద్దిలేటి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలి



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రంగనాయుడు

నంద్యాల(న్యూటౌన్): జనాభా ప్రాతిపదికన బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ బీసీ సంఘాల ఆధ్వర్యంలో మంజుల సుబ్బరాయుడు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అతిథిగా సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు మురళీధర్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీ కులాలను విభజించి పాలిస్తుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బీసీల ఓట్లతో గద్దెనెక్కి ఇప్పుడు వారిని పట్టించుకోవడం లేదన్నారు. బీసీల ఐక్యతగా ఉండి అగ్రవర్ణాలకు దీటుగా నిలబడాలన్నారు. వడ్డెర సంఘం రాష్ట్ర కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ దేశాన్ని కులాల ప్రాతిపదికన విభజించి పాలిస్తున్నాయన్నారు. దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు జడ్జిపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా బీసీ కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేయలేదన్నారు. భావసార క్షత్రియ సంఘం అధ్యక్షుడు షణ్ముఖ, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లెల్ల శ్రీరాములు మాట్లాడుతూ బీసీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమన్నారు. సమావేశంలో దూదేకుల సంఘం నాయకులు గోకారి, వాల్మీకి సంఘం నాయకులు పుల్లయ్య, కురువ సంఘం నాయకులు ఓబుపతి, శివాజీ క్షత్రియ సంఘం నాయకులు సుబ్బారావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, సోమన్న, హరినాథ్, మహిళా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, సుశీలమ్మ, నాగేంద్ర, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

‘గో బ్యాక్ మోదీ’ని విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యప్రతాప్

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 15న గో బ్యాక్ మోదీ పేరుతో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇందులో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, డీవైఎఫ్ఐ నాయకులు సూర్యప్రతాప్, రాంబాబు, రాజా, శివ కోరారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పై నాయకులు మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా, రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు కూడా చేయలేదన్నారు. విద్యార్థుల ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని సైతం ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర పన్నుతోందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో మోదీ కర్నూలు పర్యటనను వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో సీఎం చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్‌ల పర్యటనను కూడా అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు శశిధర్‌రెడ్డి, యశ్వంత్, అక్రం, మధు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం పడకేసింది

- గ్రామాల్లో లోపించిన పరిశుభ్రత
- కంపుకొడుతున్న డ్రైనేజీలు.. నిలిచిపోయిన వర్షపునీరు
- పట్టించుకోని అధికారులు
- తూతూమంత్రంగా డ్రైడే ఫ్రైడే కార్యక్రమం



అల్లూరులో ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు, మురుగు నీరు



ఉయ్యాలవాడ మోడల్‌స్కూల్ సమీపంలోని కాలనీలో మురుగు నీరు వెళ్లేందుకు మార్గం లేక కాలువలో నిలిచిన దృశ్యం

ఉయ్యాలవాడ: పల్లెలు మురుగుకూపాలుగా మారుతున్నాయి. ఎటు చూసినా చెత్తకుప్పలు, కంపుకొడుతున్న డ్రైనేజీలు, ఇళ్ల మధ్యే కుంటలను తలపించేలా వర్షం నీరు నిలిచిపోయిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఇక పేదల నివసించే ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల పరిస్థితి చెప్పనక్కరలేదు. ఇప్పటికే పల్లె జనం విషజ్వరాలు, అతిసారం తదితర సీజనల్ వ్యాధులతో అల్లాడుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో గత నెల సెప్టెంబర్ 22వ తేదీ నుంచి నేటి వరకు ఏకధాటిగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. మురికి కాలువల్లో వర్షం నీరు వెళ్లేందుకు మార్గం లేక ఎక్కడికక్కడే నిలిచిపోయి. రోజుల తరబడి నిల్వ ఉండటంతో దోమలకు ఆవాసంగా మారడంతో పాటు దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఉయ్యాలవాడ మండలంలో సుద్దమల్ల, అల్లూరు, బోడెమ్మనూరు,హరివరం, ఉయ్యాలవాడలో పరిస్థితి దారుణంగా ఉంది. ఇక్కడ పారిశుద్ధ్య పనులు పడకేశాయి.డ్రైడే ఫ్రైడే కార్యక్రమం సరిగ్గా జరగడం లేదు. ఉయ్యాలవాడలోని మోడల్‌స్కూల్ సమీపంలో గత 10 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన బీసీ కాలనీలో డ్రైనేజీలు నిర్మించారు. అయితే, వాటిలో మురుగుపేరుకుపోవడంతో కంపుకొడుతున్నాయి. పలు గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రధాన రహదారుల్లో, ఇళ్ల ముందు వర్ష నీరు నిలిచిపోతుంది. ఈ నీటిని దోమలు ఆవాసంగా మార్చుకొని రాత్రి పూట చుట్టు పక్కల నివాసిస్తున్న ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దోమల కాటుతో ఎక్కడా తమకు విష జ్వరాలు ప్రబలుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో పలువురు జ్వరాలతో మంచం పట్టారు. పరిస్థితి తీవ్ర కాక ముందు అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులుముమ్మరం చేయాలనిమండల ప్రజలు కోరుతున్నారు.